ప్రజాశక్తి
ఆదివారం 27 నవంబరు 2022
5
శ్రీకాకుళం

12 టన్నుల బియ్యం పట్టివేత

పట్టుబడిన బియ్యం

ఆమదాలవలస: అక్రమంగా నిల్వ ఉంచిన 12 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు విజిలెన్స్ డిఎస్పి సనపల కిరణ్‌కుమార్ తెలిపారు. పురపాలక సంఘం 15వ వార్డు పరిధిలోని మోణింగివారి వీధిలో పాత గోనె సంచుల వ్యాపారం నిర్వహిస్తున్న పొట్నూరు రామారావు పిడిఎస్ బియ్యం నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారంతో దాడులు చేసినట్లు తెలిపారు. ఆటో నుండి దించుతున్న 16 బస్తాలు బియ్యం, గోదాములో ఉన్న 224 బస్తాల బియ్యం రూ.4.56 లక్షల విలువైన 12 టన్నుల బియ్యాన్ని, ఆటోను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వ్యాపారి రామారావు, ఆటో డ్రైవరుపై కేసు నమోదు చేసామని తెలిపారు. ఈ దాడుల్లో రెవెన్యూ ఇనెస్పెక్టర్ శిరీష, హెచ్‌సిలు, తదితరులు ఉన్నారు.

ఉత్తుత్తి పనులేనా!

వేసవి సీజన్ అంతా పనులకు ప్రతిపాదనలు, అనుమతులంటూ కాలక్షేపం చేస్తారు. సరిగ్గా వర్షాకాలంలో పనులు మొదలు పెడతారు. అదీ కూడా కాలువల్లోకి నీరు విడిచిపెట్టిన తర్వాత కాలువల్లో గుర్రపు డెక్క తొలగింపునకు సిద్ధమవుతారు. ప్రతి ఏడాదీ వంశధార ఇంజినీరింగ్ అధికారులది ఇదే తంతు. ఈ ఏడాది అదే పని చేశారు. సెప్టెంబర్‌లో పనులు మొదలు పెట్టారు. అక్టోబర్‌లో పూర్తి చేశారు. నవంబర్‌లో మళ్లీ కాలువ నిండా గుర్రపు డెక్క కనిపిస్తుండటంతో నిజంగా పనులు చేశారా లేక ఉత్తుత్తి పనులేనా అన్న అనుమానాలు అందరిలోనూ రేకెత్తుతున్నాయి. గుర్రపు డెక్క తొలగింపు చేపట్టకపోవడంతో వంశధారలో నీటి లభ్యత ఉన్నా ఈ సారి వేలాది ఎకరాలకు సాగు నీరందలేదు

- రికార్డుల్లో లెక్కలు
- క్షేత్రస్థాయిలో కనిపించని పనులు
- వంశధారలో ఎక్కడికక్కడ కనిపిస్తున్న గుర్రపుడెక్క
- బిల్లుల చెల్లింపునకు సిద్ధమవుతున్న అధికారులు

శ్యామలాపురం వద్ద వంశధార కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార కాలువల్లో పెద్ద ఎత్తున గుర్రపు డెక్క పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ రూ.63 లక్షలను కేటాయించారు. వీటిలో రూ.43.98 లక్షల విలువ గల 67 రకాల పనులను చేపట్టాలని వంశధార అధికారులు నిర్ణయించారు. ఒక్కొక్క పని విలువ చాలా స్వల్ప మొత్తం కావడంతో నామినేషన్ పద్ధతిపై పనులు అప్పగించారు. నరసన్నపేట వంశధార మెంటెనెన్స్ డివిజన్‌లో పనుల కోసం రూ.22.49 లక్షలు కేటాయించారు. టెక్కలి మెయిన్ కెనాల్ డివిజన్‌లో రూ.5.45 లక్షలతో పనులు చేపట్టారు. హిరమండలం ప్రాజెక్టు కనస్ట్రక్షన్ డివిజన్‌లోని ఎల్ఎన్‌పేట పరిధిలో ఆరు పనులు చేపట్టేందుకు రూ.3.66 లక్షలు కేటాయించారు. ఆమదాలవలస ప్రాజెక్టు డివిజన్‌లోని 12 పనులకు రూ.9.42 లక్షలు కేటాయించగా, ఆమదాలవలస ఇన్వెస్టిగేషన్ డివిజన్‌లో మూడు రకాల పనులకు రూ.2.96 లక్షలు కేటాయించారు. కాలువల్లో చేపట్టిన పనుల మేరకు బిల్లులు చెల్లించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

నీటి లభ్యత ఉన్నా శివారు భూములకు అందని నీరు

బిల్లులు చెల్లింపునకు ఉత్సాహ పడుతున్న అధికారులు ఏ ప్రాంతంలోనూ పనులను పర్యవేక్షించినట్లు కనిపించడం లేదు. కాలువ నిండా ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున గుర్రపుడెక్క కనిపిస్తోంది. నీటి ప్రవాహానికి కొట్టుకువచ్చిందంటూ అధికారులు కట్టుకథలు చెప్తున్నారు. నీటి ప్రవాహానికి కొట్టుకువచ్చిన గుర్రపుడెక్క కాలువల నుంచే వచ్చిందన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. గుర్రపు డెక్క తొలగింపు ఫొటోలకే పరిమితం కావడంతో ఈ సారి వంశధారలో నీరున్నా పలాస, టెక్కలి నియోజకవర్గాలోని పలు ప్రాంతాలకు నీరిందని పరిస్థితి నెలకొంది. కీలకమైన పొట్ట దశలో దాదాపు 20వేల ఎకరాలకు నీరందలేదని తెలుస్తోంది.

షట్టర్లపైకి నెపం నెట్టేస్తున్న అధికారులు

సాగు నీరెందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్న ప్రజా ప్రతినిధులు, రైతులకు షట్టర్లు పాడయిపోవడం వల్లే శివారు భూములకు నీరు వెళ్లడం లేదని తప్పును షట్టర్లపైకి నెట్టేస్తున్నారు. షట్టర్ల కొనుగోళ్లపై సిఐడి కేసు ఉందని అది తేలితే గానీ కొత్తవి ఏర్పాటు చేసుకోలేమంటూ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు లేవనెత్తుతున్న సాగునీటి ఇబ్బందులను షట్టర్ల అంశం ద్వారా మళ్లిస్తున్నారు. అసలు విషయం విస్మరిస్తున్న వైసిపి, టిడిపి నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలకు దిగుతున్నారు. ఎత్తిపోతల పథకాల వల్లే పలాస నియోజకవర్గంలోని శివారు భూములకు సాగునీరందలేదని పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వ్యాఖ్యానించారు. సాగు నీరందివ్వలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని పలాస నియోజకవర్గ టిడిపి నాయకులు మంత్రిపై విరుచుపడ్డారు. వంశధార కాలువల పరిస్థితి, గుర్రపుడెక్క పేరుకు పోవడం వల్లే ఈ సమస్య తలెత్తిందన్న వాస్తవాన్ని ఏ ఒక్కరూ గుర్తించిన పరిస్థితి కనిపించడం లేదు.

'ధర్మాన' మాటకూ దిక్కులేని వైనం

జెడ్‌పిలో ఈ ఏడాది సెప్టెంబర్ తొమ్మిదో తేదీన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశంలో వంశధార ఇంజినీరింగ్ అధికారుల పని తీరుపై రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాలువ ఆయకట్టు పరిధిలో సాగునీరందించలేకపోతే ఇంజినీరింగ్ అధికారులు అవమానంగా భావించాలని చెప్పారు. రైతులతో నిరంతరం సంబంధాలు పెట్టుకోవాలని హితవు పలికారు. ఖరీఫ్ సీజన్‌లో కనీసం ఆరు నెలలైనా కెనాల్ మీద ఉండాలని, విశాఖ నుంచి విధులు నిర్వహిస్తామంటే కుదరదని తేల్చి చెప్పారు. విద్యాశాఖ మంత్రి బొత్స ఇదే విషయంపై స్పందిస్తూ ఇంజినీరింగ్ అధికారులు స్థానికంగా లేకుంటే సరెండర్ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను ఆదేశించారు. అయినా అధికారుల్లో మార్పు కనిపించడం లేదు. దాని ఫలితమే కాలువల్లో నీరు తగ్గిన తర్వాత పెద్ద ఎత్తున గుర్రపు డెక్క కనిపించడం, తద్వారా శివారు భూములకు సాగు నీరందని పరిస్థితికి దారి తీసింది.

గుర్రపుడెక్క పూర్తిగా తొలగిపోదు

కాలువల్లో ఈ ఏడాది సెప్టెంబర్‌లో గుర్రపుడెక్క పనులు చేపట్టాం. పనులు విలువ చాలా తక్కువ వ్యయం కావడంతో నామినేషన్ పద్ధతిపై కేటాయించాం. అక్టోబర్‌లోనే పూర్తి చేశాం. పనులు చేసిన మేరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. గుర్రపుడెక్క తొలగించిన మళ్లీ వస్తూనే ఉంటుంది. ఈ ఏడాది సాగునీటికి పెద్దగా ఇబ్బందులేమీ లేవు

-డిఎస్ ప్రదీప్, వంశధార ప్రాజెక్టు కార్యనిర్వాహక ఇంజినీరు

రైతుల ప్రయోజనం కోసమే ఎఫ్‌సిఐ

జిల్లా అధికారి నవీన్ నేగి

మాట్లాడుతున్న ఎఫ్‌సిఐ జిల్లా అధికారి నవీన్ నేగి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ఎఫ్‌సిఐ (భారత ఆహార సంస్థ) ఏర్పాటైనట్లు ఆ సంస్థ జిల్లా అధికారి నవీన్ నేగి తెలిపారు. ఎస్.ఎస్.వలసలో ఎఫ్‌సిఐ డిపో మేనేజర్ కార్యాలయంలో ఎఫ్‌సిఐ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రైతులకు సరైన మద్దతుధర అందించడం, రైతులు పండించిన ఆహార ధాన్యాలను నిల్వచేయడం, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయడం ఎఫ్‌సిఐ బాధ్యతలని గుర్తు చేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో ప్రజల అవసరాలు తీర్చడం, భావి అవసరాలకు తగిన విధంగా ఆహారం నిల్వచేసి, పంపిణీ చేయడం విధివిధానాల్లో భాగమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా ఎఫ్‌సిఐ పనిచేస్తుందని వివరించారు. కరోనా కాలం నుండి ప్రజలకు ఉచిత బియ్యాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం పిఎం గరీబ్ కళ్యాణ్ అన్నయోజన పథకం కింద ఒక్కొక్కరికి 5 కేజీల బియ్యాన్ని ఎఫ్‌సిఐ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం వచ్చే నెల వరకు కొనసాగుతుందన్నారు. దేశంలో అమీబియాతో బాధపడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతుండటంతో పోషక విలువలు కలిగిన బియ్యాన్ని అందించేందుకు కేంద్రం శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2024 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ఫోర్టిఫైడ్ రైస్‌ను పంపిణీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిందని అన్నారు. తొలి దశలో అంగన్వాడీ కేంద్రాలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ అమలవుతుందని తెలిపారు. దీంతో పోషకాలతో కూడిన సమతుల ఆహారం లభిస్తుందన్నారు. ఇందులో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 ఉంటుందని, ఐరన్ వల్ల రక్త హీనత ఉండదని, ఫోలిక్ యాసిడ్‌తో గర్భస్థ శిశు వికాసం ఉంటుందని, విటమిన్ బి12 వల్ల నాడీ వ్యవస్థ మెరుగుపడుతుందని వివరించారు. ప్రతి 100 కేజీల బియ్యానికి కేజీ ఫోర్టిఫైడ్ రైస్ కలుస్తుందని స్పష్టం చేశారు. ఇది ప్లాస్టిక్ రైస్ అనే అపోహ చాలా మందిలో ఉందని, అందువల్ల ఈ బియ్యం వినియోగించే పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్య పరుస్తున్నట్లు ఆయన తెలిపారు. తొలుత దేశాభివద్ధిలో భాగస్వామ్యం, పిఎంజికెఎవై, ఎండిఎం, ఇతర సంక్షేమ పథకాలు నిమిత్తం బియ్యాన్ని పంపిణి విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బి.ఎం.సింగ్, ఎపిఎఫ్‌సిఐ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ జోషి, క్వాలిటీ ఎజిఎం పూల్ చాంద్ మీనా, క్వాలిటీ మేనేజర్ అనుదీప్, డిపో మేనేజర్ వి.వి.సత్య పార్వతి, అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ విద్యార్థులు, పాఠశాలలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే పూర్తి వైద్యం చేయిస్తుంది

- చిన్నారి తల్లిదండ్రుల కోరిన చోట ఉన్నత వైద్యం
- ఇతర ఖర్చులకు రూ.లక్ష తక్షణ సాయం
- స్పష్టం చేసిన కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

కృష్ణవేణికి రూ.లక్ష చెక్కు అందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చిన్నారి మీసాల ఇంద్రజకు అవసరమైన పూర్తి వైద్యాన్ని ప్రభుత్వమే ఉచితంగా చేయిస్తుందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఇంద్రజ తల్లి కృష్ణవేణికి హామీ ఇచ్చారు. శనివారం తన ఛాంబరులో ఇంద్రజ వైద్యంపై వైద్యుల అభిప్రాయాలను ఆమె తల్లి కృష్ణవేణికి కలెక్టర్ తెలియజేశారు. చిన్నారికి అవసరమైన వైద్యం అందించడంతో పాటు ఇతర ఖర్చులకు రూ.లక్ష సిఎంఆర్ఎఫ్ కింద అందిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23న నరసన్నపేటలో పర్యటించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి బాలికకు వైద్యం అందించాలని ఆదేశించారని కలెక్టర్ తెలిపారు. అందులో భాగంగా ఇంద్రజకు వైద్య పరీక్షలు, పర్యవేక్షణ కోసం జెమ్స్ ఆస్పత్రిలో ఉంచామని చెప్పారు. బాలికకు మరింత మెరుగైన వైద్యం అందించడంతో పాటు శస్త్ర చికిత్స కూడా చేయాల్సి ఉందని వైద్యులు సూచించినట్లు కలెక్టర్ చెప్పారు. దీని కోసం వైద్యులను పిలిపించామని, వారి అభిప్రాయం కూడా తెలుసుకోవాలని కృష్ణవేణికి కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రులు కోరిక మేరకు శ్రీకాకుళం, విశాఖ, లేక హైదరాబాద్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయిస్తామని చెప్పారు.

అంతవరకు ఇతర ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.లక్ష చెక్కును కలెక్టర్ కృష్ణవేణికి అందించారు. ఏ ఇతర సహాయం కావాలన్న ప్రభుత్వం తరపున అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సమావేశంలో న్యూరోసర్జన్ డా.కృష్ణచైతన్య, జెమ్స్ ప్రాంతీయ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త పి.ప్రకాషరావు, మీసాల కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా సిబ్బందిని ఆదుకోవాలి

కలెక్టర్‌ను కోరిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చిలకపాలెం టోల్‌ప్లాజాను నేషనల్ హైవే అథారిటీ ఎత్తివేయడంతో 15 ఏళ్లుగా పని చేస్తున్న 107 మంది కార్మికులను రోడ్డున పడ్డారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. చిలకపాలెం టోల్ ప్లాజా ఆదాయాన్ని నాతవలస, మడపాం టోల్ ప్లాజా ద్వారా సర్దుబాటు చేసిన నేషనల్ హైవే అథారిటీ అధికారులు కార్మికులను మాత్రం సర్దుబాటు చేయడంలేదని వివరించారు. తక్షణమే వీరిని సర్దుబాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో చిలకపాలెం టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పి రాధిక

స్వేచ్ఛ, సమానత్వం అందరికీ దక్కాలి

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

రాజ్యాంగ లక్ష్యాలైన స్వేచ్ఛ, సమానత్వం అందరికీ దక్కాలని స్పీకర్ తమ్మినేని సీతారాం ఆకాంక్షించారు. 73వ రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ కృషి ఫలితంగానే ప్రపంచంలోనే అత్యున్నతమైన భారత రాజ్యాంగం రూపుదిద్దుకుందని తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాల రాజ్యాంగాల కంటే భారతరాజ్యాంగం ఉన్నత విలువలతో ఖ్యాతి గడించిందని అన్నారు. ఆధునిక ప్రజాస్వామ్య చరిత్రలో భారత రాజ్యాంగానికి ఉన్న విశిష్టమైన స్థానం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కమిషనరు ఎం.రవిసుధాకర్, తహశీల్దార్ వైవి.పద్మావతి, ప్రిన్సిపాల్ శ్యామసుందరరావు, హెచ్.ఎం రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. రాజ్యాంగం గొప్పతనాన్ని కొనియాడారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళి, జెడ్‌పిటిసి ప్రతినిధి చింత రామారావు, సర్పంచ్ బి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కవిటి మండలం ఆర్.బెలగాం జెడ్‌పి పాఠశాల ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ పూలమాలవేసి, నివాళులర్పించారు. ఆమెతోపాటు నర్తు రామారావు, దుక్క లోకేశ్వరరెడ్డి, పద్మ, నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.

రణస్థలంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే జి.కిరణ్‌కుమార్ పూలమాలేసి, నివాళులర్పించారు. అందరికీ రాజ్యాంగ ఫలాలు అందించిన ఘనత అంబేద్కర్‌దేనని అన్నారు. కార్యక్రమంలో బి.హేమామాలినిరెడ్డి, రొక్కం బాలకృష్ణ, మీసాల సీతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని ఎస్పి జిఆర్.రాధిక అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఆమె పూలమాలేసి, నివాళులర్పించారు. అనంతరం పోలీసు అధికారాలు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు కె.శ్రీనివాసరావు, వి.నాగమణికంఠ, టిపి.విఠలేశ్వర్, ఎం.మహేంద్ర, జివి.ప్రసాద్‌రావు, జి.శ్రీనివాసరావు, ఎస్.వాసుదేవ్, బి.విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రిక్త హస్తాలు... శుష్క వాగ్దానాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్నారంటే ఏవో వరాలు ప్రకటిస్తారని అంతా ఆశిస్తారు. ఈ సారి జిల్లాకు పర్యటనకు వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డి రిక్తహస్తమే చూపించారు. ఒక్క నరసన్నపేట నియోజకవర్గానికి సంబంధించి కొన్ని హామీలు ఇవ్వడం మినహా అదనంగా ఒరిగిందేమీ కనిపించలేదు. జిల్లాలో పెండింగ్‌లో సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తావనే లేదు. ప్రధానంగా గత 13 ఏళ్లుగా వంశధార షట్టర్ల సమస్య అపరిష్కృతంగానే ఉంది. 2009లో నరసన్నపేటలోనే వెలుగు చూసిన షట్టర్ల కొనుగోళ్ల అవినీతి అంశం నేటికీ తేలలేదు. షట్టర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై అప్పట్లో సిఐడి నమోదు చేసిన కేసు నేటికీ పెండింగ్‌లోనే ఉంది. ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుంటే గానీ సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి లేదని అనేక సందర్భాల్లో అధికారులు తమ నిస్సహాయతను వ్యక్తం చేశారు. షట్టర్ల సమస్య తేలకపోవడంతో కొత్తగా ఏర్పాటు చేయలేక పాడైన వాటితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి వచ్చింది. ఫలితంగా పలాస, టెక్కలి నియోజవర్గాలోని శివారు భూములకు. కీలకమైన పొట్ట దశలోనూ నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు.

వంశధార ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన నాటి నుంచి కాలువలు ఆధునికీకరణ పనులకు నోచుకోలేదు. ప్రధానంగా ఎడమ కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. 40ఏళ్ల కిందట రాతితో నిర్మించిన నిర్మాణాలు ప్రస్తుతం దెబ్బతినడంతో ఎడమ కాలువ సామర్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది. ఆధునికీకరణ పనులకు రూ.834 కోట్ల అవసరమని 2021-22 కొత్త రేట్లతో నివేదికను గతేడాది పంపారు. ఏడాది గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. గొట్టా బ్యారేజీ కుడి కాలువ ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో రూ.18.45 కోట్లతో అంచనాలతో రూపొందించిన ప్రతిపాదనలూ పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటితో పాటు జిల్లాకు సంబంధించి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నా ఈ సారి పర్యటనలో మెజార్టీ ప్రజలను ప్రభావితం చేసే అంశాల్లో దేనిపైనా మాట్లాడకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. జిల్లాకు సంబంధించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాత హామీలనే మరో సారి రెన్యువల్ చేశారు. ఉద్దానం ప్రాంతంలో రూ.760 కోట్లతో రక్షిత మంచి నీటి సరఫరా, పలాసలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ, రీసెర్చ్ సెంటర్ పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. అదీ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై విమర్శల దాడి కోసమే వాటిని ప్రస్తావించినట్లుగా కనిపించింది. ప్రసంగం ఆద్యంతం భూ హక్కులపైనే సాగింది తప్ప జిల్లాకు కొత్తగా ఏమీ ప్రకటించకపోవడంతో నిరాశే కలిగింది.

వీక్షణం

సిఎం పర్యటనపై టిడిపి నాయకులు ఆదరాబాదరగా ఆ రోజే మీడియా సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం చేస్తున్న సర్వే భూరక్ష కాదు భూ భక్ష అంటూ విమర్శల దాడి చేశారు. వారసత్వంగా సంపాధించుకున్న ఆస్తులను కొల్లగొట్టేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పథకం వేశారంటూ ఆరోపణలు గుప్పించారు. ఆధారాల్లేని ఆరోపణలతో విమర్శలకు దిగారు. పలానా ప్రాంతంలో వాస్తవ భూమి కంటే తక్కువ విస్తీర్ణంలో భూములు రికార్డుల్లో నమోదయ్యాయని గానీ, సరిహద్దు సెటిల్‌మెంట్‌లు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పే ప్రయత్నం ఎక్కడా చేయలేదు. జిల్లాలో కవిటి, బూర్జ తదితర మండలాల్లో తమకున్న భూమి కంటే తక్కువ భూమి వచ్చిందంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. సర్వేపై అభ్యంతరాలు ఉంటే తహశీల్దార్ కార్యాలయాల్లో చెప్పుకోవాలని ప్రభుత్వం సూచించినా అక్కడా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. పలుకుబడి ఉన్న అధికార పార్టీ నాయకులు చెప్తే అక్కడక్కడ నామమాత్రంగా సరిచేశారు. జిల్లాలో 785 సరిహద్దు వివాదాలు పరిష్కరించామని అధికారులు చెప్తున్నారు. కానీ ఎన్ని వచ్చాయో సమాచారం వారి దగ్గరలేదు. సరిహద్దు సమస్యలు తేలనవి, నోషనల్ ఖాతాలు, కమ్యూనిటీ ల్యాండ్స్ సరిహద్దుల నిర్ధారణ తదితర సమస్యలూ ఉన్నాయి. క్షేత్రస్థాయి పరిశీలనతోనే భూ యజమానుల ఇబ్బందులను తెలుసుకునే అవకాశం ఉంది. అవేవీ చేయని టిడిపి నాయకులు ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ద్వారా ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లో పెట్టొచ్చేమో గాని ఇందులో రైతులకు ఒరిగిందేమీ లేదు జగన్మోహన్‌రెడ్డి జిల్లాకు ఐదు సార్లు వచ్చినా ఏం చేయలేకపోయారంటూ టిడిపి నాయకులు తమ విమర్శల పరంపర కొనసాగించారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులు 80శాతం తామే పూర్తి చేసినట్లుగా, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి భవనాలు వారే కట్టినట్లుగా గొప్పలకు పోయారు. టిడిపి అధికారం కోల్పోయే నాటికి కలెక్టరేట్ నిర్మాణ పనులు సగం కూడా పూర్తి కాలేదనేది వివిధ సందర్భాల్లో నిర్వహించిన అధికారిక సమీక్షల్లోనే తేటతెల్లమైంది. వంశధార పనులు 97 శాతం పూర్తి చేశామని టిడిపి నాయకులు మరీ గొప్పలకు పోయారు. ఇప్పటివరకు జరిగిన పనులే 93 శాతం దాటలేదనేది వారు గుర్తించినట్లుగా లేదు. వంశధార 87 ప్యాకేజీ పనులు 82 శాతం, ప్యాకేజీ 88 పనులు 92 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 92.5 శాతం పూర్తయ్యాయనేది అధికారిక రికార్డులు చెప్తున్నాయి. మరి 97 శాతం పనులు చేసేశామని టిడిపి నాయకులు చెప్పడం జనం చెవిలో పూలు పెట్టడమే అవుతుంది. అధికారంలో ఉన్నవారు తామే అభివృద్ధి చేసినట్లుగా చెప్పుకోవడం, గత పాలకులు ఏమీ చేయలేదని విమర్శలు గుప్పించడం పరిపాటిగా మారిపోయింది. నాడు టిడిపి ఆ పని చేస్తే ప్రస్తుతం వైసిపి ఆ పాత్ర పోషిస్తోంది. జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి లేని పాలకులు, ప్రజా సమస్యలపై ప్రశ్నించలేని టిడిపి ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవడం చూసి జిల్లాకు ఇదేం దుస్థితి అని ప్రజలు అనుకుంటున్నారు.

ఉప్పు రైతులు నష్టపోకుండా చూస్తాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని సముద్ర తీర ప్రాంతంలోని ఉప్పు కర్మాగారాల కోసం కేంద్ర ప్రభుత్వం లీజుకు కేటాయించిన భూములను రాష్ట్ర ప్రభుత్వం తీసుకునేందుకు నిర్ణయించిందని, వ్యాపారులు, ఉప్పు రైతులకు నష్టం కలగకుండా చూస్తామని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో భూముల అప్పగింతపై జిల్లాలోని సాల్ట్ ఇండస్ట్రీస్ యాజమాన్యాలు, ప్రతినిధులతో కలెక్టర్ చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం ఇందుకు సుముఖంగా ఉందని, ఈ మేరకు సాల్ట్ ఇండస్ట్రీస్ కమిషన్‌కు కేంద్ర ప్రభుత్వం లేఖ రాసిందని తెలిపారు. అందులో భాగంగా ఉప్పు పరిశ్రమల యాజమాన్యాలు, రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం కోరిందన్నారు. ఉప్పు కర్మాగారాల కోసం కేంద్రం ఐదు వేల ఎకరాల భూమిని లీజుకు కేటాయించిందని, అందులో 2.186 ఎకరాల్లో పరిశ్రమలు ఉండగా, మిగతా 800 ఎకరాలలో మాత్రమే ఉప్పు సాగు జరుగుతున్నట్లు కలెక్టర్ వివరించారు. కేటాయించిన భూముల లీజు కాలం ఇంకా ఉన్నప్పటికీ ప్రభుత్వానికి అప్పగించేందుకు అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. కృష్ణపట్నం పోర్టు రైతులకు చెల్లించేలా నష్టపరిహారం చెల్లిస్తే భూములు అప్పగించేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని ఉప్పు కర్మాగారాల యాజమాన్యాలు తెలియజేయడంతో వారి అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. యజమానులతో పాటు ఉప్పు సాగు రైతులు కూడా నష్టపోకుండా చూస్తామని, ప్రభుత్వం ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, తహశీల్దార్ చలమయ్య, కళింగ సాల్ట్ ఇండస్ట్రీస్, జిఅండ్‌డి పార్టనర్స్, నౌపడ సాల్ట్ ఇండస్ట్రీస్ యాజమాన్యాలు, భాస్కర్‌రెడ్డి, భానోజీరావు, భాస్కర్‌రెడ్డి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM (PROHIBITION AND EXCISE COURT). OS 156/2020

Between :
Tangudu Trinadharao --- plaintiff

And :
Chandrasekharuni Udayashyankumar --- Defendant

To
ChandrasekharuniUdayashyankumar
S/o Durgaprasad, Aged 35 years, Hindu. Residing at MIG 482 .APHB Old Colony Down,Srikakulam Town and District .

Please take notice that the above matter is posted to **29-11-2022** for your appearance ,you are hereby Directed to appear before the Honourable court on **29-11-2022** without fail other the matter will be Decided in your absence.

G. VISALAKSHI
ADVOCATE
SRIKAKULAM

మాట్లాడుతున్న వి.జి.కె.మూర్తి

లౌకిక స్ఫూర్తిని కాపాడుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ రాజ్యాంగాన్ని లౌకిక ప్రజాతంత్ర స్ఫూర్తిని చైతన్య పూరితంగా ప్రజలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసులు అన్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ప్రభుత్వోద్యోగుల విశ్రాంతి భవనంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవ సభ విజెకె.మూర్తి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమానత్వ సాధన, భావప్రకటన స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, సామరస్యం వంటి రాజ్యాంగ లక్ష్యాలను నేటి పాలకులు తూట్లుపొడుస్తున్నారన్నారు. మత విద్వేషాలు రగిల్చి ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. ఫెడరల్ స్ఫూర్తిని బలహీనపరుస్తూ రాష్ట్రంలో ఇతర రాజకీయ పార్టీలను అస్థిరపరచడం, రాజ్యాంగ వ్యవస్థలను తమ చెప్పు చేతుల్లోకి తీసుకుని దుర్వినియోగ పరుస్తున్నారని అన్నారు. వి.జి.కె.మూర్తి మాట్లాడుతూ భూగర్భ వనరుల నుంచి అంతరిక్ష ఉపగ్రహాల వరకు ప్రభుత్వరంగాన్ని ప్రయివేటు పరం చేస్తూ ఆర్థిక అంతరాలు తీవ్రం చేస్తున్నారని విమర్శించారు. దళితులు, గిరిజనులు సామాజిక న్యాయం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపైన మైనార్టీలపైనా దాడులు నిత్యకృత్యమవుతున్నాయన్నారు. ఉద్యమాలపై, హక్కుల కార్యకర్తలపైన మీడియాపైన తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు ఉండకూడదనే ధోరణితో ఏక పక్ష నియంతృత్వపు పోకడలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సురంగి మోహనరావు, ప్రొఫెసర్ ఉదయ్‌కిరణ్, హేతువాద నాయకులు కె.వి.జగన్నాథం, దళిత సంఘాల నాయకులు కంఠవేణు, ముస్లిం జెఎసి ప్రతినిధి జిలాని, గార గాంధీ, కృష్ణారావు, పి.సుధాకరరావు, సిఐటియు నాయకులు తేజేశ్వరరావు, న్యాయవాది ఈశ్వరరావు, మధుసూదనరావు, రంగప్రసాద్, అర్జునరావు, ఎం.ప్రభాకరరావు పాల్గొన్నారు.

నీటితీరువా వసూలు చేస్తే కేసులు పెడతాం

వంశధార అధికారులను హెచ్చరించిన మండల ప్రత్యేక ఆహ్వానితులు సాయికృష్ణ

మాట్లాడుతున్న ఎంపిపి ప్రవీణ

ప్రజాశక్తి- పలాస

శివారు భూములకు వంశధార నీరు ఇవ్వనప్పుడు నీటి తీరువా ఎలా వసూలు చేస్తారని, రైతుల నుంచి నీటి తీరువా వసూలు చేస్తే కేసులు పెడతామని మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉంగ సాయికృష్ణ వంశధార అధికారులను హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ వరి పంటలకు నీరందించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి వంశధార అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఉపాధి కూలీలకు జాబ్ కార్డులు సక్రమంగా మంజూరు చేయడం లేదని, కూలీలకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా కూలి రావడం లేదని, అందుకు ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. మండలంలో ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు మంజూరు చేసి, ప్రభుత్వం నిర్దేశించిన కూలి డబ్బులు వచ్చేలా చూడాలని సూచించారు. ఎంపిపి ప్రవీణ మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయం ఎంత విస్తీర్ణంలో ఉంది, కార్యాలయం హద్దులు తెలపాలని ఏడాది క్రితం దరఖాస్తు చేసినా... ఇంత వరకు ఎందుకు హద్దులు తెలపడం లేదని రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే మండల సమావేశం జరిగే లోపు హద్దులు చూపించకపోతే సహించేది లేదని హెచ్చరించారు. చినంచల ఎంపిటిసి బి.దుర్యోధన మాట్లాడుతూ హౌసింగ్‌లో అవకతవకలు జరిగాయని, బిల్లులు ఎలా చెల్లించారని హౌసింగ్ ఎఇ వైకుంఠరావును నిలదీశారు. పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి స్పందిస్తూ చిన్న చిన్న సమస్యలను చూసి చూడనట్టు ఉండాలే తప్ప ప్రజలకు ఇబ్బందులు పెట్టకూడదన్నారు. గ్రామంలో హౌసింగ్ సమస్య ఉంటే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్ మాట్లాడుతూ బొడ్డపాడులో జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేసేందుకు ఇబ్బందులు ఉన్నాయని చెప్పగా... దీనిపై హౌసింగ్ ఎఇ మాట్లాడుతూ భూ సమస్య రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లని చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ, 104 అధికారులు మండల సమావేశానికి హాజరు కాకపోవడంపై వెంకటరావు

హౌసింగ్ ఎఇని నిలదీస్తున్న వెంకటరావు, సాయికృష్ణ

చిట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో 104 వాహనాలు ఎక్కడ పెడతారో తెలియదు... ఏమి మందులు పంపిణీ చేస్తున్నరో తెలియని పరిస్థితి నెలకొందని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడుని కోరారు. రెంటికోట సర్పంచ్ శాసనపురి తిరుమలరావు మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు ఎందుకు పూర్తి చేయడం లేదని పిఆర్ ఎఇ పార్వతిని ప్రశ్నించారు. సచివాలయం లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విశాఖపట్నం రాజధానిగా ఉండాలంటూ తీర్మానం చేశారు. అంతకు ముందు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. సమావేశంలో వైస్ ఎంపిపిలు తలగాన శ్రీరాములు, సవర దాలమ్మ, జెడ్‌పిటిసి మచ్చ రత్నాలు, మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

ఓబులేష్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో లెక్చరర్ మృతి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని శాసనం జాతీయ రహదారిపై శనివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డి.ఓబులేష్ (52) మృతి చెందగా, మరో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న దాసరి రాము గాయాలు పాలయ్యారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో దుస్తులు కొనుగోలు చేసి తిరిగి పలాస వస్తుండగా గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. వెంటనే స్థానికులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించగా... చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఓబులేష్ మృతి చెందారు. ఓబులేసుది అనంతపురం జిల్లా కదిరి గ్రామం. మృతి చెందిన విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు కళాశాల అధ్యాపకులు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే కాశిబుగ్గ సీఐ శ్రీనివాసరావు ఘటనా స్థలం చేరుకొని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

సోంపేట: మండలంలోని కొర్లాం సమీపంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో పురుషత్తం, ఎం.గిరి, ఎన్.దేవిలు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బారువ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు..

పలాస : కాశీబుగ్గ చినబాడ పాత జాతీయ రహదారిపై శనివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గరుడ గంధం నుంచి కాశీ బుగ్గ వైపు వస్తుండగా మందస మండలం పితాతోల్‌కు చెందిన కె.నిర్మల ద్విచక్ర వాహనంపై జారిపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రభుత్వ వైద్యులు చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీల బ్యాటరీలు చోరీ

కొత్తూరు : మండలంలోని కలిగాం రోడ్డులో ఉన్న అమ్మనమ్మ రైస్ మిల్లులో ఈ నెల 24న రెండు లారీలకు చెందిన నాలుగు బ్యాటరీలు, తాగునీరు మోటారు బోరుకు చెందిన సెక్షన్ పైప్ చోరీకి గురైనట్లు ఎస్ఐ ఎం.గోవింద శనివారం తెలిపారు. వంబరవెల్లి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. వీటి.విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు.

మహిళ అదృశ్యం

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురానికి చెందిన మడపాల సావిత్రమ్మ బుధవారం నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ టి.రాజేష్ శనివారం తెలిపారు. టెక్కలిలోని తన బంధువులు ఇంటికని వెళ్లి తిరిగి రాలేదని ఈ మేరకు ఆమె భర్త మడపాల పొట్టన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రసవత్తరంగా 'గ్రిగ్స్' పోటీలు

ప్రజాశక్తి- పలాస

పలాస ఉన్నత పాఠశాలలో బాలబాలికల జూనియర్లకు, సీనియర్లకు నిర్వహించిన గ్రిగ్స్ పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల్లో జోనల్ మీట్‌కు ఎన్నికైన జట్లు వివరాలు ఇలా ఉన్నాయి. ఖోఖో సీనియర్ బాలురు పలాస, బ్రాహ్మణతర్లా, బాలికలు విభాగంలో చినబడాం, పలాస, జూనియర్స్ బాలురు విభాగంలో పలాస, మదర్ థెరిసా, బాలికల విభాగంలో చినబడాం, పలాస, వాలీబాల్ సీనియర్ బాలురు విభాగంలో పలాస, రంగోయి, బాలికలు విభాగంలో కాశీబుగ్గ, మదర్ థెరిసా, జూనియర్స్ బాలురు విభాగంలో రంగోయి, రెంటికోట, బాలికలు విభాగంలో పలాస, రంగోయి నిలిచాయి. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు టి.చిట్టిబాబు, మల్లా భద్రయ్య పరిచయ కార్యక్రమంతో పోటీలను ప్రారంభమయ్యాయని క్రీడల సమన్వయకర్త పి.తవిటయ్య తెలిపారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా హరిబాబు పద్మలోచనం, దీనబంధు రాంజీ, తిరుమల, లక్ష్మణరావు వ్యవహరించారు.

పొందూరు : మండలంలోని పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సుగ్గు కాసులబాబు ఆధ్వర్యాన రెండు రోజులుగా నిర్వహించిన మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను,

ఇచ్ఛాపురం : అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఇచ్ఛాపురం : స్థానిక సురంగిరాజా క్రీడా మైదానంలో కబ్బడీ, వాలీబాల్ వంటి గ్రిగ్స్ పోటీలను మండల క్రీడా నిర్వాహకులు కె.పద్మనాభరెడ్డి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ గ్రిక్స్ పోటీలకు బాలబాలికల నుంచి 39 మంది బృందం పాల్గొన్నాయి. ఇందులో విజేతలకు జోనల్ పోటీలను డిసెంబరు 13,14 (బాలురుకు), 15,16 (బాలికలకు) నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పిఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్ చేయాలని వినతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి చెందిన ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను సరిచేసి స్లిప్పులను ఆన్‌లైన్ చేయాలని ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్‌లు కోరారు. జిల్లా పరిషత్ పరిపాలనాధికారి రామేశ్వరరావుని శనివారం కలిసి వితనిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మూడేళ్ల నుంచి పిఎఫ్ మినహాయింపులు ఇప్పటికీ ఆన్‌లైన్‌లో ఉంచలేదన్నారు. వెంటనే మినహాయింపులను లెడ్జర్‌లో పోస్ట్ చేసి ఆన్‌లైన్ చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. వెంటనే సరి చేయాలని కోరారు. ఆన్‌లైన్‌లో ఉంచడానికి చర్యలు తీసుకుంటానని ఎఒ హామీనిచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా కార్యదర్శులు హనుమంతు అన్నాజీరావు, జి.సురేష్, బి.రవికుమార్, జిల్లా నాయకులు బి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి : ఎంపీ

ప్రజాశక్తి- కంచిలి

రాజకీయాలకు అతీతంగా విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్నామని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని ఎం.ఎస్.పల్లి మోడల్ పాఠశాలలో శనివారం ఆర్ఒ ప్లాంట్, సోలార్ సిస్టంలను స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, వాటి అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లవేళలా అందిస్తామన్నారు. గతంలో ఇక్కడకు వచ్చిన సమయంలో విద్యార్థులు తాగునీటికి, విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారన్నారు. వాటిని పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో సైతం ప్రభుత్వ పాఠశాలల్లో

కంచిలి : ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

మౌలిక వసతుల కల్పనకు తమ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, పాఠశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లు శంకుస్థాపనలు చేశారు. మండలంలోని శాసనం, అరకబద్ర, బి.తోటూరులో ఎంపీ గ్రాంట్ నిధుల నుంచి ఒక్కో భవన నిర్మానానికి రూ.5 లక్షల చొప్పున మంజూరయ్యాయి. కార్యక్రమంలో టిడిపి నాయకులు దక్కత ఢిల్లీరావు, పెద్దిన బాబ్జీ కామేశ్వరరావు, సూర్యనారాయణ, పద్మనాభం, శ్రీను, సహదేవ్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని రాజపురంలో ఉన్న మోడల్ పాఠశాలలో ఎంపి నిధులతో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్‌ను ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లు ప్రారంభించారు. రూ.5 లక్షల ఎంపి నిధులతో గ్రామంలోని మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ సిస్టమ్, మినరల్ వాటర్ ప్లాంట్‌నూ ప్రారంభించారు. అనంతరం రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో మాక్ పార్లమెంట్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు, బెందాలం రమేష్, లోళ్ల శ్రీను, సంతోష్ పట్నాయక్, పుల్లట సంతోష్, బాసుదేవ్ ప్రధాన్ పాల్గొన్నారు.

భవిష్యత్‌పై కచ్చితమైన లక్ష్యం అవసరం

అవగాహన కల్పిస్తున్న గణపతి

సోంపేట: విద్యార్థి దశలో నిర్లక్ష్య ధోరణి ఉండకూడదని, భవిష్యత్‌పై కచ్చితమైన లక్ష్యం కలిగి ఉండాలని మనోవికాస నిపుణుడు రాంబుడ్డి గణపతి అన్నారు. బారువ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల పరిచయ వేదిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు గుణాత్మకమైన విద్యనభ్యసించి, సమాజానికి దిక్సూచిగా మారాలన్నారు. ఆకర్షణలకు లోను కాకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని అకుంఠిత దీక్షతో వాటిని సాధించాలన్నారు. సాంకేతికతను ఉపయోగించుకొని మంచి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ ఒక్కరూ వ్యక్తిగత శ్రద్ధతో విద్యాభ్యాసం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సలీం భాషా, ఎన్ఎస్ఎస్ పిఒలు సీతారాం, రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగంతో పాటు కుటుంబానికి ప్రాధాన్యం

ఎఎస్‌పి కె.శ్రీనివాసరావు

శ్రీకాకుళం: ఉద్యోగంతో పాటు కుటుంబానికి, కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత ఇస్తూ విధులు నిర్వహించాలని ఎఎస్‌పి కె.శ్రీనివాసరావు అన్నారు. నాన్ కేడర్ ఎస్‌పిగా ఉద్యోగోన్నతితో పాటు, విజయవాడ ట్రాఫిక్ డిఎస్‌పిగా బదిలీపై వెళ్తున్న శ్రీనివాసరావును శనివారం ఉదయం ఎస్‌పి కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణతోపాటు, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. అంకితభావం, నిబద్ధతతో పనిచేసినప్పుడే మన్ననలు పొందగలమని చెప్పారు.

ఎఎస్‌పిని సత్కరిస్తున్న సిబ్బంది

అనంతరం పరిపాలన విభాగం తరపున ఎం.శివ రామరాజు ఎఎస్‌పికి దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి జి.శ్రీనివాసరావు, ఎస్‌పి సిసి శివకుమార్, బాలకృష్ణ, బాలరాజు,శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు వాకర్స్ యోగా భవనానికి శంకుస్థాపన

శ్రీకాకుళం అర్బన్ : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పి.జి.గుప్త, శాసపు జోగినాయుడు, జి.ఇందిరాప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం యోగా భవన్ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొవాలని కోరారు.

సచివాలయం తనిఖీ

టెక్కలి రూరల్ : మండలంలో తలగాం సచివాలయాన్ని ఎంపిడిఒ ఎంపిడిఒ చింతా లక్ష్మీబాయి శనివారం తనిఖీలు చేపట్టారు. ఇటీవల రద్దయిన పింఛన్లు, అలాగే సచివాలయంలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ చెత్త సేకరణ కేంద్రాల పనులు వేగవంతం చేసి చెత్త నుంచి సంపద వచ్చే విధంగా కృషి చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ఉపాధి పనులను పరిశీలించారు. ఈమెతో పాటు ఎపిఒ బాగాది ప్రసాదరావు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు ఉన్నారు.

వమరవల్లి గురుకులం ప్రిన్సిపాల్‌గా అరుణ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని వమరవల్లి ప్రభుత్వ బాలికల గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్‌గా బాడాన అరుణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు తెలుగు పిజిటిగా పనిచేసిన బి.సత్యనారాయణ ఎఫ్ఎసి ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. బయాలజీ పిజిటిగా పనిచేస్తున్న అరుణను ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఎపిఆర్ఇఐఎస్ సెక్రటరీ (గుంటూరు) ఆర్.నరసింహరావు ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఆమె బాధ్యతలు స్వీకరించారు.

పోస్టర్లను అందజేసిన 'ఎంజిఆర్' సభ్యులు

ఇంటింటికీ 'ఎంజిఆర్'

ప్రజాశక్తి- కొత్తూరు

సామాజిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు ఇటీవల పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు ఎంజిఆర్ యువసేన నాయకులు మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ దెప్పిగూడ, చీపురుపల్లి, కాకరగూడ, కొత్తగూడ, వుల్లిమన్‌గూడ, పుల్లగూడ, బూతాలగూడ, గొట్టిపల్లి, పాడలి, దబ్బగూడ గ్రామాల్లో శనివారం ఇంటింటికీ ఎంజిఆర్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోవిందరావు సంక్షేమ కార్యక్రమాలు తెలియజేస్తూ పోస్టర్లను అందజేశారు. నియోజకవర్గంలో 12 ఏళ్లుగా ఎంజిఆర్ చేస్తున్న సేవ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలకు వివరించారు. నిత్యం పేదల సమస్యలపై ఎంజిఆర్ స్పందించి ఆర్థిక సహాయం అందిస్తున్నారని అన్నారు. ఎంజిఆర్ ప్రతి గిరిజన గ్రామాన్నీ దత్తత తీసుకుని మౌలిక వస్తువులు కల్పన, పారిశుధ్య నిర్వహణ, విద్య, వైద్యం, ఆరోగ్యం, అభివృద్ధి దృష్టి పెడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఆరుబోలు దశరథ, వాలిపల్లి వెంకటరమణ, పిండి రామారావు, బిల్లింగ్ భాస్కరరావు, ఎంజిఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, కొయిలాపు కృష్ణమాచార్యులు, మండపాన రామరాజు, యర్లింకి తిరుపతిరావు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

వజ్రపుకొత్తూరు : డిసెంబరు 8,9,10 తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని వ్య.కా.స. జిల్లా సహాయ కార్యదర్శి డి.భాస్కరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు వజ్రపుకొత్తూరులో మహాసభ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలన్నారు. రెండు వందల రోజులు ఉపాధి పని కల్పిస్తూ.. కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదు కేజీల బియ్యం పది కేజీలకు పెంచాలన్నారు. కూలీలకు ఇళ్ల మంజూరు చేయాలన్నారు. మిగులు భూములను భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.భానుమతి, నెయ్యల లక్ష్మి, ఎస్.సరోజిని, ఎస్.పుష్పలత, లోలాక్షి, బత్తిని పారమ్మ, ఎన్.సంతు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం' పరిశీలన

ఇచ్ఛాపురం : మండలంలోని మందపల్లి పంచాయతీ బొడ్డేపుపేట పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కొత్త మెనూ, నాడు-నేడు పనులను వెలుగు ఎపిఎం ప్రసాదరావు పేరెంట్స్ కమిటీతో కలిసి శనివారం పరిశీలించారు. ప్రభుత్వం ఈ నెల 21 నుంచి మధ్యాహ్న భోజన పథకంలో మెనూ మార్పు చేసిందని, కొత్త మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సదుపాయం ఎలా ఉంది, భోజనం చేసే పరిసరాల్లో పరిశుభ్రత ఎలా ఉంది? నాడు-నేడు మంజూరైన నిధులు ఏ మేరకు ఖర్చు అవుతుంది, నిర్మాణ పనులు ఏ స్థితిలో ఉన్నాయి పరిశీలించారు. వెల్ఫేర్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

అభివృద్ధికి శిక్షణలు దోహదం

బూర్జ: గోగునార ఉత్పత్తులతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని ఆత్మీ పీడీ పి.కృష్ణారావు అన్నారు. మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ సంస్థలో విలువ జోడించిన గోగునార ఉత్పత్తులపై గ్రామీణ యువతకు నిర్వహించిన నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు శనివారంతో ముగిసింది. ఈ శిక్షణాకు 20 మంది యువతకు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన యువత సొంతంగా అధిక ఆదాయం పొందేందుకు ఈ శిక్షణలు ఉపయోగంగా ఉంటాయన్నారు. ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శ్రీలత మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గోగునార అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు.

మాట్లాడున్న కృష్ణారావు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా గోగు ఉత్పత్తులను బ్యాగులు, పెన్ బాక్సులు, టేబుల్ మ్యాట్లు తదితర 15 రకాల వస్తువులపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, శాస్త్రవేత్తలు స్వాతి, రాజశేఖర్, ఆర్ట్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

మందస: డిసెంబరు 3, 4 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించనున్న సిఐటియు 11వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మండల నాయకులు కె.కేశవరావు, ఆర్.దిలీప్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. మండలంలోని రాధాకృష్ణాపురం పరిధిలోని రైస్ మిల్లు కూడలిలో జిల్లా మహాసభల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సభలు సందర్భంగా శ్రీకాకుళంలో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీడి, రైస్‌మిల్లు కార్మికుల సంఘాల నాయకులు కె.బాలకృష్ణ, కె.కూర్మా రావు, ఎం.ధర్మారావు, బి.దుర్యోధన, ఎన్.లచ్చయ్య, ఆర్.ఏకాసీ, పి.తులసయ్య, బి.లచ్చయ్య, జి.బాలమ్మ, చంద్రమ్మ, జానకమ్మ, కె.సరస్వతి, ఎస్,సరస్వతి, డి.కాంతమ్మ, డి.సంతోషి పాల్గొన్నారు.

రమేష్‌కు కేక్ తినిపిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ఘనంగా రమేష్ పుట్టినరోజు

కవిటి: జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు, టిడిపి నాయకుడు బెందాలం రమేష్ పుట్టినరోజు వేడుకలను ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాలం అశోక్ సమక్షంలో శనివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన రమేష్ ఎంపీ, ఎమ్మెల్యేలకు అందించారు. అనంతరం ఎంపి, ఎమ్మెల్యేలు రమేష్ కు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీపాన వెంకటరమణ, లోళ్ల శ్రీను, పుల్లట రాజు, పుల్లట సంతోష్, సంతోష్ పట్నాయక్, బారౌలో, బాసుదేవ్ ప్రధాన్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి

పొందూరు: గణితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు గణిత ఉపాధ్యాయులు కృషి చేయాలని పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సముదాయం చైర్మన్, ఎంఇఒ పి.వి.రామరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకరోజు గణిత ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇంగ్లీషు, తెలుగు భాషా నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా గణితంలో అనుకున్న స్థాయిలో లక్ష్యాలు సాధించవచ్చునని తెలిపారు. అభ్యసనాభివృద్ధికి బోధనతో పాటు సాధనా అవసరమన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ కె.రామినాయుడు, పలు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న దేవానందరెడ్డి

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా రాజు

సంతబొమ్మాళి: రాష్ట్ర ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా మండలానికి చెందిన బాడాన రాజు ఎంపికయ్యారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎపి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ తరపున ఎపి ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఈ అవార్డును అందజేశారు. రాజు ప్రస్తుతం మండలంలోని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకునిగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, విషయ నిపుణుడిగా సాంఘిక శాస్త్ర సమున్నతంగా నిలబెట్టడానికి అందించిన విశిష్ట సేవలకు ఈ అవార్డును ప్రభుత్వం అందజేసింది. రాజు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడంపై వివిధ ఉపాధ్యాయ సంఘా నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



చెరకు కటింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

చెరుకు కటింగ్ మిషన్ ప్రారంభం

బూర్జ: మండలంలో వైపర్తలో ప్యారిస్ ఇఐడి సుగర్ ఫ్యాక్టరీ ఆధ్వంర్యాన ఏర్పాటు చేసిన చెరుకు కటింగ్ మిషన్ హార్వెస్టర్‌ను ఇఐడి ప్యారిస్ పాలకొండ డివిజన్ మేనేజర్ కమల్ పట్నాయక్ శనివారం ప్రారంభించారు. చెరుకు రైతులకు, కూలీల ఇబ్బందులకు తగ్గించేందుకు, రోజుకు ఐదు ఎకరాలు, 59 నుంచి 70 టన్నుల వరకు చెరుకును కట్ చేస్తుందని ఏరియా సూపర్‌వైజర్ పోలా రావు తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు లోలుగు విశ్వేశ్వరరావు, పాలకొండ పిఎసిఎస్ అధ్యక్షులు లోలుగు నారాయణ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చింత సంగం నాయుడు, మాజీ సర్పంచ్ బోరాడ తేజేశ్వరరావు, జడ్డు నాగరాజు, సిడిఒఒ ఫీల్డ్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ 'ఉపాధి'

మెళియాపుట్టి : అర్హులందరికీ ఉపాధి కల్పించాలని ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎపిఒ రవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనులపై అలసత్వం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సత్యవతి

ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెజ్జిపురం ఫాల్గుణరావు, సనపల అన్నాజీరావు, దేశెళ్ల గోవింద మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి గ్రంథాలయ చైర్‌పర్సన్ ప్రతినిధి సువ్వారి సత్యనారాయణ, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్ శంకరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఇచ్ఛాపురం శాంతి నికేతన విద్యా సంస్థలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాలు మేరకు రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్, న్యాయవాది దక్కత కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యాన ఈ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కె.సి.పూర్తి, డి.త్రిషా, లక్ష్మీనరసింహ, శంకర్, శ్రీధర్, పద్మజ పాల్గొన్నారు.

కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘం నాయకులు డి.జయమ్మ, బొమ్మాళి గుమ్మయ్య, నాగభూషణం, ఎంపిటిసి త్రినాథమ్మ, తిరుపతిరావు, గౌరీష్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

టెక్కలి అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి అట్లా సరోజనమ్మ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో చింతాడ మంజు, గణపతిరావు, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసిలు పీత హేమలత, వాకాడ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెళియాపుట్టిలోని అంబేద్కర్ విగ్రహానికి పిఎసిఎస్ అధ్యక్షులు ఊర్లన బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, జెడ్‌పిటిసి ఎండయ్యలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జనపరెడ్డి కన్నబాబు, వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రరావు, గణేష్ ప్రధాన్ పాల్గొన్నారు.

జి.సిగడాం ఎపి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ అన్నా శ్యామల్ లంక, కెజిబివి పాఠశాలలో వాండ్రాంగి సర్పంచ్, దళిత ఐక్య వేదిక అధ్యక్షులు సాకేటి నాగరాజు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారత్నకుమారి పాల్గొన్నారు.

నందిగాం మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

సోంపేట మండలం బారువ సచివాలయంలో సర్పంచ్ ఎర్ర రజిని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బెందాళం వెంకటరమణ, ఇఒపిఆర్‌డి టి.వాసుదేవరావు, హౌసింగ్ ఎఇ శివరామకృష్ణ పాల్గొన్నారు.

లావేరుశాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విద్యార్థులతో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. వ్యాసరచన పోటీలో కనకం దేవ మనోజ్‌కు ప్రథమ, పి.సత్యనారాయణకు ద్వితీయ, ఎస్.రాజేష్‌కు తృతీయ బహుమతులు గెలుపొందారు. కార్యక్రమంలో స్థానిక లిటిల్ స్కూల్ ప్రిన్సిపాల్ టి.బాలరాజు, గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

జి.సిగడాం మండలం మద్రివలసలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలాలు వేసి, వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న నాయకులు

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, డాక్టర్ చింతాడ రవికుమార్, డాక్టర్ హనుమంతు ఉదయభాస్కర్లు సదస్సు నిర్వహించారు. ఐతమ్ ఎన్ఎస్ఎస్, శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్ర, ఎన్‌సిసి యూనిట్ల ఆధ్వర్యాన రాజ్యాంగ ప్రాధాన్యతపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ బి.బలరాం పాల్గొన్నారు.

సోంపేట కోర్టుల సముదాయం వద్ద జిల్లా అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాము రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు.

ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యాన ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.ఎన్.స్వామి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.జగన్నాథరావు, డాక్టర్ శ్యాంకుమార్, డాక్టర్ శ్రీనివాసరావు, ఉషా పద్మిని, కె.బాలరాజు, పి.అష్టలక్ష్మి, ఎస్.ప్రసాద్, టి.రాజశేఖర్ పాల్గొన్నారు.

పలాస-కాశిబుగ్గ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పిలక కృష్ణారావు, అరుణ్ కుమార్, కార్యదర్శి తెప్ప పాపారావు, ఉపాధ్యక్షులు బేరి అప్పారావు, యెరుమాకు దేవరాజు, ఉర్నాన అప్పలరాజు, సహాయ కార్యదర్శి కోన రవికుమార్, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు బి.దుర్యోధన, సభ్యులు విజయకుమార్, సంజయ్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలోని అంబేద్కర్ విగ్రహానికి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి మేరుగ అప్పారావు, స్థానిక గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి నక్క భీమారావు, మండల అధ్యక్షులు కోత సతీష్, సర్పంచ్‌లు దుక్క భూషణరెడ్డి ,జోగి రాములమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

రణస్థలం మండలం జె.ఆర్.పురంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం పార్లమెంటరీ జిల్లా ఎస్‌సి మోర్చా అధ్యక్షుడు తొంపల అప్పలరాజు, మండల ఉపాధ్యక్షులు గురాల రఘునాథ్, బంటుపల్లి ఎంపిటిసి తొంపల సంజీవరావు, ముక్తుంపురం గ్రామ అధ్యక్షులు కాయిత రమణ, గోపిన కృష్ణారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

సరుబుజ్జిలి జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు అధ్యక్షతన ఉపాధ్యాయులతో ప్రజ్ఞన చేశారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ రాంప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పలాస : విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత సంఘ నాయకులు

టెక్కలి ప్రభుత్వం కళాశాల ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బేవల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్ పాల్గొన్నారు. మండలంలోని బూరిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు ఎ.చిన్నారావు, సమతా సైనిక్ దల్ జిల్లా కార్యదర్శి చల్లా రామారావు ఆధ్వర్యాన ఎస్‌సి బాలికల వసతిగృహంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, అలాగే పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి పూలమాలలు వేసి నివాల్లర్పించారు. కార్యక్రమంలో సూపరెంటెంట్ ఎస్.రాజ్యలక్ష్మి, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పురుషోత్తపురం పాఠశాలలో 'నమూనా పార్లమెంట్'

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం వై.లత ఆధ్వర్యాన రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో నమూనా పార్లమెంట్‌ను నిర్వహించారు. పార్లమెంట్‌లో పార్లమెంటు సభ్యుల సిట్టింగ్ పోలిన విధంగానే పాలక, ప్రతిపక్షాలకు వేర్వేరుగా బెంచీలను అందంగా ఏర్పాటు చేశారు. స్పీకర్‌గా టెన్త్ క్లాస్ విద్యార్థిని గిన్ని లక్ష్మి వ్యవహరించింది. తన వాక్చాతుర్యంతో అత్యద్భుతంగా మాక్ పార్లమెంట్‌ను నడిపించింది. ప్రధానమంత్రిగా ఆకాష్‌నాయక్, ప్రతిపక్ష నేతగా పి.రాజు వ్యవహరించారు. సభ్యుల ప్రశ్నలు, మంత్రుల సమాధానాలు, వివిధ బిల్లులపై చర్చ, ఓటింగ్, ఆమోదం వంటి కార్యక్రమాలను ఎంతో అద్భుతంగా నిర్వహించారు. మాక్ పార్లమెంట్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనిర్వచనీయమైన అనుభూతిని మిగిల్చింది.

ఇచ్ఛాపురం : నమూనా పార్లమెంట్‌ను నిర్వహిస్తున్న విద్యార్థులు

మాక్ పార్లమెంట్ నిర్వహణకు విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు డి.దేవరాజు, రాజగోపాల్, రాజ్యలక్ష్మి, సత్యవాణి, రాంప్రసాద్, ఆదిలక్ష్మి, పిఇటి పాలెపు సూర్యనారాయణ సహకరించారు.

రాజ్యాంగ విలువలకు తిలోదకాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాజ్యాంగ విలువలకు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం తిలోదకాలిస్తోందని, కక్ష సాధింపు, కూల్చివేత, దాడులు, అత్యాచారఘటనలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆరోపించారు. శనివారం రాజ్యాంగాన్ని ఆమోదించి 73 ఏళ్ల పూర్తయిన సందర్భంగా నగరంలోని ఆదివారంపేటలో టిడిపి ఆధ్వర్యాన అంబేద్కర్‌విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా లభించిన హక్కులను సైతం రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.ఎం.జె.బాబు, సంతు సుధాకర్, ఎస్.వి.రమణ మాదిగ, రాజారావు పాల్గొన్నారు.

పలాస: ఆంధ్రప్రదేశ్‌లో సిఎం జగన్ రెడ్డి రాజ్యాంగం అమలవుతుందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పివితల్‌రావు ఆరోపించారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా టిడిపి నాయకులు కాశీబుగ్గ బస్టాండు వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, నవీన్, గాలి కృష్ణ, కృష్ణమూర్తి, రవిశంకర్ గుప్తా, చంద్రరావు, శ్రీనివాసరావు, దశరథ, రామకృష్ణ, మోహనరావు పాల్గొన్నారు.

టెక్కలి : ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం మంట కలిసిందని, రాజ్యాంగపరంగా పౌరుల హక్కులకు భంగం కలుగుతుందని టిడిపి సెల్‌సి సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు మట్ట పురుషోత్తం అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అప్పలస్వామి, మామిడి రాము, కోళ్ల లవరాజు, పోలాకి షణ్ముఖరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీదేవి

సంక్షిప్త వార్తలు

పైపులైన్ పనుల పరిశీలన

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న సమగ్ర తాగునీటి సరఫరా పథకం పైపులైన్ పనులు వేగవంతంగా చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అధికారులకు ఆదేశించారు. కమిషనర్ నల్లి రమేష్‌తో కలిసి పురుషోత్తపురం, ఎ.ఎస్.పేట వద్ద చేపడుతున్న పైపులైన్ పనులను శనివారం పరిశీలించారు. ఈ సంరద్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు గ్యాస్ కంపెనీ నుంచి 2.8 కిలోమీటర్ల వరకు రూ.50 లక్షల ఖర్చుతో ఎ.ఎస్.పేట వరకు పైపులైన్లు వేశామని అన్నారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. 1,2,3 వార్డులు ప్రజలు ఎప్పటి నుండో పైప్‌లైన్ ద్వారా నీటి కోసం ఎదురు చూస్తున్నారని, వచ్చే కొత్త సంవత్సరంలోగా వార్డు ప్రజలకు తాగునీరు అందేలా కృషి చేయాలన్నారు. వీరితో పాటు ఒకటో వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, కో-ఆప్షన్ మెంబరు సాలీనా ఢిల్లీ ఉన్నారు.

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ

ఇచ్ఛాపురం : మండలంలోని రక్తకన్న, మందపల్లి, ధర్మపురం, తులిసిగాం, బెల్లుపడ రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తుందని ఎఒ శ్రీదేవి అన్నారు. స్థానిక మండల పరషత్ కార్యాలయంలో సలహా మండలి చైర్మన్ దక్కత నూకయ్యరెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రబీ విత్తనాల సరఫరా కేంద్రాన్ని ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయనమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో మోహనరావు, ఉప్పాడ రాజారెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు రంగాల కృష్ణారెడ్డి, వైసిపి నాయకులు కొగ్గాయి రెడ్డి, దీనబంద్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కళావెంకటరావు పరామర్శ

లావేరు: మండలంలోని కేశవరాయునిపురం పంచాయతీకి చెందిన నాయకులు, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర సోదరుడు కుమారుడు రమణ కిడ్నీ వ్యాధి సమస్యతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు శనివారం పరామర్శించారు. ముందుగా రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం లావేటిపాలెకు చెందిన యినపకుర్తి రాంబాబు భార్య గోవిందమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను, బట్టుపాలెంలో పలువురుని పరామర్శించారు. ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు ముప్పడి సురేష్, మాజీ ఎంపిపి మీసాల రమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పి.మధుబాబు మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాసరావు, దారుపురెడ్డి కూర్మారావు, నడిమింటి చార్లెస్, గండి సురేష్, గరుగుబిల్లి సర్పించి బాడిత లక్ష్మణరావు ఉన్నారు.

పిఎసిఎస్ అధ్యక్షులు...

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ నేతాజీ నగర్ చెందిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు లోతుగెడ్డ తిరుపతిరావు కుమారుడు రవి కిశోర్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈయన వెంట పల్లి వైకుంఠరావు, టి.తమ్మినాయుడు, జి.నాగేంద్ర, ఎంనరసింహులు, టి.సింహాచలం, బర్రి గోవిందరావు, చంద్రశేఖర్, టి.అచ్యుత్, కృష్ణ, మోహనరావు ఉన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం: పట్టణంలెని మెయిన్ రోడ్డు గాంధీ పార్కు శనివారం ఎఆర్ఎస్ సూపర్ స్పెషలిటీ క్లినిక్‌లో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. పట్టణంలోని తొలిసారిగా కాలేయంతో బాధపడుతున్న రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ టి.వి. ప్రదీప్ కుమార్ 160 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య సలహాలను, సూచనలను అందజేశారు.

నవజాతశిశు అంబులెన్స్ ప్రారంభం

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్‌లో శిశు మరణాల రేటును తగ్గించే చర్యల్లో భాగంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి నవ జాత శిశువులకు 108 అంబులెన్స్ సేవలను తీసుకొచ్చారని నందిగాం నౌగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్ఎన్ అప్పలనరసమ్మ అన్నారు. పిహెచ్‌సి ఆవరణలో నవజాత శిశు అంబులెన్స్‌ను శనివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా 108 ఇఎంటి దేవాది శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. శిశువు జన్మించిన నుంచి 28 రోజుల లోపు అత్యవసర సమయంలో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఈ అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒ సూర్యనారాయణ, హెచ్‌వి ఇస్తర్, స్టాఫ్‌నర్స్ మల్లీశ్వరి, గీత, అనూష, హేమసుందర్, రామారావు, జీవనరావు, రాజారావు, రామన్న పాల్గొన్నారు.

బాధితులకు దుస్తుల పంపిణీ

జి.సిగడాం: మండలంలోని మద్రివలసలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో షేక్ బీబీ, షేక్ జయానాబిలు పూరిళ్లు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కుమార్ శనివారం బాధితులను పరామర్శించారు. అనంతరం దుస్తులు, సామగ్రిని అందజేశారు. పక్కా ఇళ్లు మంజూరు చేయాలని తహశీల్దార్ వేణుగోపాలరావుకు సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కాయల రమణ, వైసిపి మండల అధ్యక్షులు బూరాడ వెంకటరమణ, బూత్ కమిటీ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, జి.సిగడాం పిఎసిఎస్ అధ్యక్షులు ఎర్నేని ప్రకాష్, వైస్ ఎంపిపి తోలేటి వెంకటరావు, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలి అప్పలసూరి, సర్పంచ్ విక్రం కోటిబాబు పాల్గొన్నారు.

దుస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రామ్‌మల్లిక్‌నాయుడు...

అగ్నిప్రమాద బాధితులకు టిడిపి నాయకులు కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు దుస్తులు, నిత్యవసర సరుకులు అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్ సీతారాం

ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు విడుదల

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో దేవాదాయశాఖ అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాదాయశాఖ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, అభివృద్ధి కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లోని ఆలయాలాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఆమదాలవలస మండలం కొత్తవలసలోని సీతారామ ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షలు, కొల్లివలసలో సంగమేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి 30 లక్షలు, బెలమాంలోని శివాలయం నిర్మాణానికి 40 లక్షలు, రామచంద్రాపురంలోని వల్లభేశ్వరస్వామి ఆలయ నపిర్మాణానికి 40 లక్షలు, దివంజిపేటలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి రూ.60 లక్షలు, ఆమదాలవలస పట్టణంలోని సత్యనారాయణ స్వామి వారి ఆలయ నిర్మాణానికి రూ.60 లక్షలు, తొగరాంలోని వల్లభ నారాయణస్వామి ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షలు, కలివరంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షలు, బూర్జ మండలం తమ్మినాయుడుపేటలోని విష్ణుమూర్తి ఆలయ నిర్మాణానికి రూ.40 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఆయా దేవాలయాలను పునర్నిర్మానం చేసి పూర్వ వైభవం తీసుకురావడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత, ఎసి ప్రసాదరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల బదిలీపై విమర్శలు తగదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల బదిలీలపై కూడా విమర్శలు చేస్తూ, వాటిని జగన్మోహనరెడ్డికి ఆపాదిస్తూ కొలీజియంను విమర్శించడం తగదని వైసిపి లీగల్ సెల్ అధ్యక్షుడు ఎం.ఎస్.వినయభూషనరావు అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయంప్రతిపత్తితో ఎవరికి ఏ కష్టం కలిగినా న్యాయం జరుగుతుందన్న ప్రజల సంపూర్ణ విశ్వాసాలతో పని చేసే న్యాయస్థానాలకు రాజకీయాలు ఆపాదించడం తగదన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన వారు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. న్యాయవ్యవస్థలో బదిలీలనూ తమ స్వార్థానికి వాడుకోవడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. రాజ్యాంగంలో అంబేద్కర్ పొందుపరిచిన ప్రతి అంశాన్నీ ప్రజలకు చేరువచేసే విధంగా వైసిపి పాలన సాగుతోందన్నారు. దాన్ని చూసి ఓర్వలేకే న్యాయవ్యవస్థను రాజకీయాల్లోకి లాగుతున్నారని విమర్శించారు.

వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్సీ చెంగల్రాయుడుపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి స్టేట్ లీగల్ సెల్ కోర్ కమిటీ మెంబర్ గేదెల వాసుదేవరావు, నగరశాఖ అధ్యక్షుడు టంకాల బాలకృష్ణ, కార్యదర్శి బత్తుల శ్యామసుందరరావు, లోలుగు వెంకటరమణ, పీస జయరాం, త్రిపురాన వరప్రసాదరావు, పట్నాయకుని అప్పారావు, పిట్టా దామోదరరావు, లోలుగు శ్రీనివాసరావు, డొప్ప జగదీశ్వరరావు, తమ్మ రాజేష్, బలివాడ సింధు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

'ఐతమ్' అధ్యాపకులకు ముగిసిన శిక్షణ

శిక్షణా పత్రాలను అందజేస్తున్న నాగేశ్వరరావు

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగంలో ఈ నెల 21 నుంచి అధ్యాపకులకు నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అధ్యాపక, ఇతర నిర్మాణ రంగంలో నిష్ణాతులైన వారితో తరగతులు నిర్వహించామని తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో 118 మంది అధ్యాపకులు పాల్గొన్నారని అన్నారు. అంతర్జాతీయంగా మారుతున్న సాంకేతిక పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకొని విద్యార్థులకు బోధించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఇటువంటి సదస్సులు భవిష్యత్‌లో నిర్వహిస్తామని అన్నారు. సదస్సు కన్వీనర్, సివిల్ హెచ్ఒడి డాక్టర్ పి.దినకర్, కో-కన్వీనర్ డాక్టర్ హెచ్.రామ్మోహన్, కో-ఆర్డినేటర్ బి. గోవిందరాజులు కృషిని డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావులు అభినందించారు.

పారదర్శకంగా వ్యవసాయ కమతాల గణన

జిల్లా ఉపగణాంక అధికారి సురేంద్ర

ప్రజాశక్తి- జలుమూరు

మండలంలో చేపట్టనున్న వ్యవసాయ కమతముల గణన పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఉపగణాంక అధికారి దేసూళ సురేంద్ర అన్నారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శనివారం తహశీల్దార్ బి.సత్యం అధ్యక్షతన వరల్డ్ అగ్రికల్చర్ సెన్సెస్‌లో భాగంగా విఆర్ఒలకు కమతాల గణనపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సర్వేలో చిన్న, సన్నకారు, మీడియం, పెద్ద, అతిపెద్ద రైతులను ఎస్‌సి, ఎస్‌టి, ఒసి వర్గీకరణలో విఆర్‌ఒలు ఎన్యూమరేటర్‌గా ఉండి ప్రత్యేక యాప్‌లో ఆన్‌లైన్ చేయాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించనున్న ఈ సర్వే ప్రస్తుతం 2020-21 ప్రాతిపదికన చేపడుతున్నామని అన్నారు. జిల్లాలోని 30 మండలాల్లో 1466 రెవెన్యూ గ్రామాల్లో సుమారు 29 లక్షల సర్వే నంబర్లలోనీ సర్వే చేపట్టనున్నట్లు చెప్పారు. మండలంలోని 54 రెవెన్యూ గ్రామాల్లో 20 మంది విఆర్‌ఒలతో 91,086 సర్వే నంబర్లలో సర్వే చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఒ బి.సుధాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేంద్ర

ఎన్‌టిఆర్ స్ఫూర్తితో...

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజావ్యతిరేక పాలనను అంతం చేసేందుకు.. తెలుగు ప్రజలంతా ఎన్‌టిఆర్ స్ఫూర్తితో చైతన్యవంతులు కావాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ పిలుపునిచ్చారు. ప్రజా చైతన్య యాత్ర ప్రారంభం సందర్భంగా టెక్కలి ప్రవేశ ద్వారంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళ్లర్పించారు. మాజీ సిఎం నందమూరి తారక రామారావు ఏ విధంగా ఖాకీ దుస్తులను ధరించి ప్రజల మధ్యకు వెళ్లారో, ఇప్పుడు తానూ ఖాకీ దుస్తులను ధరించి జగన్ ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక తీరును ప్రజల్లోకి తీసుకెళ్లానని అన్నారు. కార్యక్రమంలో బి.దొరబాబు, డి.పరమేశ్వరరావు, డి.వెంకట రమణ, జె.రమణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి- కంచిలి

మండలంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపిపి పైల దేవదాసు రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి ఇంజినీరింగ్, హౌసింగ్, పంచాయతీరాజ్ అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు, సమస్యల పరిష్కారానికి అధికారులు మరింత శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చల్లా శ్రీనివాసరెడ్డి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలని ధర్నా

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలని టిడిపి ప్రభుత్వం హయాంలో పాత్రునివలస వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే ఇవ్వాలని టిడిపి సీనియర్ నాయకులు గొండు శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస వద్ద ఉన్న టిడ్కో ఇళ్ల కాలనీ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పులు చేసి లబ్ధిదారులు తమ వాటా కింద రూ.లక్షలు డిపాజిట్లు నగరపాలక సంస్థకు చెల్లించారని, ఆ నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొని ఉందని అన్నారు. ఐదు వేల ఇళ్ల నిర్మాణం చేపట్టారని, వాటిలో ఇప్పటికే 1280 ఇళ్లు పంపిణీకి టిడిపి ప్రభుత్వం సిద్ధం చేసిందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.వి.రమణ, అంపోలు మూర్తి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు మూకళ్ల శ్రీను, పాత్రునివలస సర్పంచ్ పంచిరెడ్డి అప్పలనాయుడు, తూలుగు మాజీ సర్పంచ్ కొయ్యన జగదీష్, కంచు దశరథ పాల్గొన్నారు.

నివాళ్లర్పిస్తున్న మంత్రి ధర్మాన

తిలక్‌ను పరామర్శించిన 'ధర్మాన'

నందిగాం: కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తల్లి సత్యమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం పరామర్శించారు. ముందుగా సత్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వైసిపి నాయకులు చింతాడ రవికుమార్, మెంటాడ స్వరూప్, పైడి మహేశ్వరరావు, గొండు కృష్ణమూర్తి, బలగ ప్రకాష్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్లాన భైరాగి, కోటబొమ్మాళి జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఇచ్ఛాపురం నాయకులు నర్తు నరేంద్ర యాదవ్, అన్నెపు రామారావు, ఎర్ర చక్రవర్తి, సుమారు వసంత్ కుమార్, రేగల లక్ష్మీకాంతం, చింతాడ గణపతి పాల్గొన్నారు.

టిడిపి పూర్వ వైభవానికి కృషి

బూర్జ: వచ్చే ఎన్నికల్లో టిడిపిని తిరిగి అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని టిడిపి తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు తమ్మినేని సుజాత పేర్కొన్నారు. మండలంలోని నీలాపురంలో మహిళలతో మాటా - మంతి కార్యక్రమాన్ని మండల అధ్యక్షులు రాంజీనాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, మహిళా మండల అధ్యక్షులు ఎ.శ్రీదేవి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు రామకృష్ణ, జగన్నాథనాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుజాత